

# శివుడు

44

**-మధుబాబు**

'బండరాళ్ళతో నిండి వుండే కొండ చెరియల మీద పది మందికి ఉపయోగపడే పంటలు పండించవచ్చని, అడుగుతీసి అడుగు వెయ్యటానికి కూడా వీలుపడని ఏటవాలు ప్రదేశాల్లో రహదారులు నిర్మించవచ్చని ప్రజలకు చెప్పి, వారిని మెప్పించి సౌగంధ సామ్రాజ్యాన్ని స్థాపించారు నా పూర్వీకులు. వంట్లో ఊపిరి ఉన్నంతకాలం ప్రజలకు మేలు చేస్తూనే బ్రతికారు. అటువంటి మహా మహులు అధిష్టించిన సింహాసనం మీద నీ వంటి అధములు కూర్చోవటం ఎప్పటికీ జరగదు' కనుకొలకులు ఎర్రబడుతుండగా కఠినంగా అన్నాడు శివకేశవ చంద్రుడు.

'తండ్రి మాటను ధిక్కరించి ఒక అధమాధముడిని వరించిన నీ పెద్దకూతురు ఎవరు? ఆమెకు పుట్టిన బిడ్డ ఎటువంటిది? ఆ బిడ్డకు జన్మించిన వాడు నీకు వారసుడు ఏ విధంగా అవుతాడు? అధమాధముల్లో కెల్లా పరమ అధమాధముడు కాదా వాడు?' కోరగా చూస్తూ అడిగాడు భద్రేశ్వరుడు.

'వాడు ఎవరనేది అప్రస్తుతం. వాడిలో మా సౌగంధీయుల రక్తపుచారికలు వుంటాయి. ఆ అర్హత నీకు లేదు. నువ్వు అనర్హుడివి' క్లుప్తంగా చెప్పాడు శివకేశవచంద్రుడు మరోసారి.

'ముసలివాడివి కాబట్టి నీ వయస్సును గౌరవించి ఈ సంభాషణను ఇక్కడితో వదిలేస్తున్నాను.... సౌగంధికి కాబోయే చక్రవర్తిని నేనే' తను కూడా తన నిర్ణయాన్ని అదే మాదిరి క్లుప్తంగా చెప్పాడు భద్రేశ్వరుడు.

'నీ అంతట నువ్వుగా చక్రవర్తినని ప్రకటించుకోవడం వల్ల ఏమీ ఉపయోగం లేదు. ప్రజలు అంగీకరించాలి. ప్రభువుల వారి రక్తపు ఛాయలు లేని వారిని సౌగంధ ప్రజలు తమ ఏలికగా అంగీకరించరు' ఉన్నట్లుండి కల్పించుకున్నాడు - మగతగా పడి వున్న సత్రం మనిషి.

'ఓ... నీకు తెలివి వచ్చిందన్నమాట... సమయానికి మాకు శిఖావంతుడి మంత్రులు మార్గ దర్శనం చేయబట్టి నీవు ఆడిన నాటకం బట్ట బయలు అయింది. ఇంతకాలంగా నిన్ను చూస్తూనే వున్న మాకు నువ్వు ఈ ముసలి నక్కకు గూఢచారివని తెలియనే లేదు' అతనికేసి తిరుగుతూ అన్నాడు భద్రేశ్వరుడు.

'శిఖావంతుడిని నమ్మినవాళ్ళు ఎవరూ బాగుపడలేదు ప్రభూ..' అన్నాడు సత్రం మనిషి.

## జరిగిన కథ

జ్వలిత సామ్రాజ్యంలో సంపంగి నగర రాజ్యాధినేత సాగరుడు పెంచుతున్న అనాథల్లో ఒకడు శివుడు. అతడు పరాక్రమశాలి. జనహిత చర్యలే అతడి నైజం. అడుగడుగునా తన వీరత్వాన్ని రుజువు చేసుకుంటూ అందరిమన్ననలూ పొందుతాడు. శత్రురాజు శిఖావంతుని కుట్రల గురించి రాజుకు ముందుగానే కబురు జేరవేస్తాడు. ప్రధాన గూఢచారి వాసుదేవుణ్ణి, యువరాణి జ్వాలను ఆపదల నుండి రక్షిస్తాడు. శివుడి పరాక్రమం చూసి అబ్బురపడుతుంది జ్వాల. అతడి పుట్టుపూర్వోత్తరాలు ఆరా తీస్తుంది. శత్రురాజు 5 వేల మంది సైన్యాన్ని,వందలాది భల్లూకాలను మోహరించిన విషయాన్ని శివుడు పసిగట్టి వర్తమానం జేరవేస్తాడు. ఈ లోపు శత్రురాజు సైన్యం సంపంగి నగర గ్రామాలపై దాడులు చేస్తుంటే శివుడు,జ్వాల వారిని తిప్పికొట్టారు. శత్రుసైన్యం సంపంగినగరం కోటను స్వాధీనం చేసుకోవడంతో సాగరుని కుటుంబం అడవులపాలవుతుంది. భల్లూకాల్ని మట్టుపెట్టే ఉపాయాన్ని కనిపెట్టి శివుడు, సాగరుడు సైన్యంతో రాత్రి దాడులు చేసి సంపంగి నగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంటారు. తర్వాత జ్వాలా సామ్రాజానికి వెళ్ళి శిఖావంతుడి సైన్యాన్ని తరిమికొడతారు.

ఈలోపు శివుడు అనాథ కాదనీ, అతడి తండ్రి సాగరుడే అని, సౌగంధరాజ్య వారసుడని కనిపెడతారు జ్వాల,దారులతాదేవి. శిఖావంతుడు ఈ విషయం తెలుసుకుని సౌంగధ పాలకుల్ని రెచ్చగొట్టే పనిలోపడతాడు. వాసుదేవుడు కూడా ఆ దేశానికి బయలుదేరి వెళ్ళి సాగరుని తప్పేమీ లేదనే విషయాన్ని ఆ రాజ్యాధినేత శివకేశవచంద్రకు తెలిసేట్టు చేస్తాడు. రాజ్యకాంక్షతో భద్రుడు వారందరినీ బంధిస్తాడు. ఆ తర్వాత...



